ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

## జూలై 23 భారతజాతీయ ప్రసార దినోత్సవం సందర్భంగా…

# ఆకాశవాణి

## ఆవిర్భావం, వికాసం, తెలుగు సాహిత్యానుబంధం — ఒక సమగ్ర అధ్యయనం

డా.శివయ్య రాజులపాటి
అతిధి అధ్యాపకుడు, ఆంధ్ర విశ్వకళాపరిషత్
9491647639

Received: 28/05/2026
Article Accepted: 24/06/2026
Published Online: 26/06/2026
DOI:10.53414/Sahithyatharangini.2026.3.2.211

**సారాంశం**

1902లో ఇటలీకి చెందిన మార్కోని రేడియోకు పేటెంట్ పొందినప్పటి నుండి, ఇప్పటి వరకు రేడియో ప్రసారాల ప్రయాణం 125 సంవత్సరాల దరిదాపుల్లో ఉంది. 'ఆకాశవాణి' భారతదేశంలో 1920లో ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ నుండి 1936లో AIR మారి ఈ యేడాది జూన్ 8వ తేది నాటికి 90 వసంతాలు పూర్తి చేసుకోవడం జరిగింది.1958లో 'ఆకాశవాణి' నామస్వీకారం, 1997లో ప్రసారభారతి కార్పొరేషన్, FM Rainbow, DTH, NewsOnAir మొబైల్ ఆప్ వరకు సుదీర్ఘ ప్రయాణం. 1938 జూన్ 16న తెలుగు ప్రసారాలు మదరాసులో ప్రారంభమైనప్పటి నుండి తెలుగు సాహిత్యానికి, బాల-యువ సాహిత్యానికి, శాస్త్రీయ-లలిత సంగీతానికి, రేడియో కథ/కథానిక శిల్పానికి ఆకాశవాణి అపూర్వ వేదికగా నిలిచింది. ప్రస్తుత పరిశోధన వ్యాసం ఈ సుదీర్ఘ చారిత్రక యాత్రను సమగ్రంగా విశ్లేషిస్తూ — 'ఆకాశవాణి' నామకరణ వివాదాన్ని ప్రాథమిక సాక్ష్యాధారాలతో పరిష్కరించడం, ఆధునిక మీడియా వెల్లువలో ఆకాశవాణి ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించడం, పునరుజ్జీవన మార్గాలను సూచించడం — వంటి అంశాలను ప్రస్తావిస్తుంది.

**ముఖ్య పదాలు:** ఆకాశవాణి, ఆల్ ఇండియా రేడియో, ప్రసారభారతి, నామకరణ వివాదం, తెలుగు ప్రసారాలు,శ్రవ్య సాహిత్యం, ప్రజా సేవా ప్రసారం, బాలానందం, FM Rainbow.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

**ప్రవేశిక**

ప్రకృతిలో నింగి, నేల, నీరు, నిప్పు, గాలి అనే ఐదు మూలకాలున్నాయని తత్త్వ శాస్త్రాలు చెబుతున్నాయి. వైజ్ఞానిక శాస్త్రమూ ఇది ధృవీకరిస్తోంది. మనిషి శరీరం కూడా ఈ ఐదు మూలకాలతోనూ రూపొందిందన్నది అందరికీ తెలిసిందే. ఈ ఐదింటికీ ఒక్కో ధర్మం ఉంది — మట్టికి వాసన, నీటికి రుచి, నిప్పుకి రూపం, గాలికి స్పర్శ, ఆకాశానికి శబ్దం. వీటిని మనిషి తన ఇంద్రియాలతో గ్రహిస్తాడు. ఆ పంచేంద్రియాల్లో శబ్దాన్ని గ్రహించేది కర్ణేంద్రియం — అంటే 'చెవి'. ఈ శబ్దం ఆకాశం గుండా ప్రయాణించి చెవిని చేరుతుంది కనుకనే ఆ ప్రయాణించి వచ్చే శబ్దాన్ని 'ఆకాశవాణి' అంటున్నాం. ఇది వట్టి ఊహ కాదు, సహేతుకమైన వాదన.

ఆకాశం నుండి శబ్దం ప్రయాణించి నేరుగా మనిషి చెవిని తాకడానికి మధ్య ఒక యంత్రం పనిచేయాలి. ఆ మాటల పెట్టే 'రేడియో' చేస్తోంది పని. లాటిన్‌లో 'Radius' అంటే 'Ray' లేదా 'Beam' — అదే ఆంగ్లంలో Radio అయింది. విద్యుదయస్కాంత తరంగాల ద్వారా ధ్వని ప్రసారమై ఒక గ్రాహకాన్ని చేరి తిరిగి ధ్వనిగా వినిపించడం ద్వారా సమాచారం వ్యాపిస్తుంది. మనిషికి మాట, రాత, దృశ్యం — సమాచార ప్రసారానికి అత్యంత ముఖ్యమైనవి. వీటిలో గొంతుక, నాలుక, చెవులతో పనిపడ్డ ప్రసార వ్యవస్థ 'ఆకాశవాణి'. వినే వాటిని ఆకళింపు చేసుకొనేందుకు మానసిక ప్రయత్నం అవసరం; ఆ ఊహను అంత సజీవంగా అల్లుకోగలిగేలా చెప్పడం వాస్తవాల మీద ఆధారపడ్డ మాటల తీరు-తెన్నుల ది.

ఈ నేపథ్యంలో — ఆకాశవాణి ఆవిర్భావ-వికాస చారిత్రక యాత్రను, తెలుగు సాహిత్యానికి ఆకాశవాణి అందించిన అపూర్వ సేవను పరిచయం చేయడం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశము.

**ప్రపంచంలో రేడియో పుట్టుక**

రేడియోను ఎవరో ఒక్కరు అమాంతంగా ఆవిష్కరించలేదు. ఫోన్, టెలిగ్రాఫ్ వంటి శబ్ద ప్రసార వ్యవస్థల అభివృద్ధి స్వరూపంగా రేడియో ఆవిర్భవించింది. 1902లో ఇటలీకి చెందిన గుగ్లిల్మో మార్కోనీ రేడియోకు పేటెంట్ పొందడం ఈ ప్రయాణానికి ఒక మైలురాయి. The full form of Radio is — originated from wireless telegraphy. విద్యుదయస్కాంత తరంగాల ద్వారా దృశ్య కాంతి కింది పౌనఃపున్యాల వద్ద సంకేతాలను ఖాళీ ప్రదేశం ద్వారా ప్రసారం చేయడమే రేడియో మౌలిక సాంకేతికత. వైర్‌లెస్ టెలిగ్రఫీ నుండి ఉద్భవించిన ఈ సాంకేతికత క్రమంగా ప్రపంచమంతటా విస్తరించింది.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

**భారతదేశంలో రేడియో ప్రవేశం, విస్తరణ**

భారతదేశంలో రేడియో ప్రవేశం 1920లో ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ స్థాపనతో మొదలైంది. 1921 ఆగస్టులో టైమ్స్ ఆఫ్ ఇండియా పరిమితమైన ప్రసారాలు చేసింది. 1923 జూన్‌లో బొంబాయి రేడియో క్లబ్, 1923 నవంబర్‌లో కలకత్తా రేడియో క్లబ్, 1924 జులై 31న మద్రాస్ ప్రెసిడెన్సీ రేడియో క్లబ్ — ఇవన్నీ ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో ఏర్పడ్డాయి. సంస్థాగతంగా రేడియో ప్రసారాలు 1927 జూలై 23న అప్పటి బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ ప్రారంభించిన ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ (IBC), బొంబాయి కేంద్రంతో మొదలయ్యాయి. అందుకే ఏటా జూలై 23ను 'భారత జాతీయ ప్రసార దినోత్సవం'గా జరుపుకుంటుంది భారతదేశం.

1927 ఆగస్టు 26న IBC కలకత్తా కేంద్రం స్థాపన; 1930 ఏప్రిల్ 1న ఇండియన్ స్టేట్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్‌గా పేరు మార్పు; 1933లో మహబూబ్ అలీ హైదరాబాద్‌లో సొంత ప్రసార కేంద్రాన్ని స్థాపించుకొని తక్కువ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌మీటర్ ద్వారా నగరానికే పరిమితమైన ప్రసారాలు చేసేవారు; 1935 ఫిబ్రవరి 3న ఈ కేంద్రాన్ని నిజాం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని 'నైజాం రేడియో' ప్రారంభమైంది; 1935 సెప్టెంబర్ 10న మైసూర్ సంస్థానంలో ప్రైవేట్ రేడియో ప్రారంభం; 1936 జనవరి 19న మొట్టమొదటి వార్తా ప్రసారం; 1936 జూన్ 8న 'ఆల్ ఇండియా రేడియో' (AIR) నామకరణం; 1938 జూన్ 16న మదరాసు కేంద్రం ద్వారా తెలుగు ప్రసారాలు ప్రారంభం; 1939లో 'నైజాం రేడియో' 'డక్కన్ రేడియో'గా రూపాంతరం; 1942లో మైసూర్ ప్రైవేట్ రేడియోను సంస్థానం స్వాధీనం; 1947 దేశ విభజన నాటికి దిల్లీ, బొంబాయి, కలకత్తా, మద్రాసు, తిరుచిరాపల్లి, లక్నో — ఆరు కేంద్రాలు పనిచేసేవి.

1947 నవంబర్ 12న మహాత్మా గాంధీ ఢిల్లీ రేడియో స్టేషన్‌ను సందర్శించి, పాకిస్తాన్ నుండి వచ్చి కురుక్షేత్రలో కాందిశీకుల శిబిరాల్లో తలదాచుకున్న వారిని ఉద్దేశించి రేడియోలో మాట్లాడారు. ఈ చారిత్రక సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ 2001 నుండి ఏటా నవంబర్ 12ను 'భారత ప్రజా సేవా ప్రసార దినోత్సవం' (Public Service Broadcasting Day) గా జరుపుకుంటోంది భారతదేశం. 1948 సెప్టెంబర్ 18న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమయ్యాక, 1948 డిసెంబర్ 16న బరోడా స్టేషన్‌ను భారత ప్రభుత్వం స్వీకరించింది. 1950 ఏప్రిల్ 1న భారత ప్రభుత్వం దక్కన్ రేడియోతో సహా అన్ని ప్రైవేట్ రేడియోలను తన ఆధీనంలోకి తీసుకుంది — ఇది సమగ్ర ప్రభుత్వ ప్రసార వ్యవస్థగా మార్చిన చారిత్రక చర్య.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

**'ఆకాశవాణి' నామకరణం — చారిత్రక వివాదం, పరిష్కారం**

'ఆకాశవాణి' అనే నామకరణానికి సంబంధించి సాహిత్య వర్గాల్లో ఒక చారిత్రక వివాదం ఉంది. మూడు ప్రధాన అభిప్రాయాలు చలామణిలో ఉన్నాయి. మొదటిది — ఈ పేరును రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ గారు వాడారని ఒక అపవాదు. రెండవది — యం.వి. గోపాలస్వామి (మైసూర్ ప్రైవేట్ రేడియో స్థాపకులు) ఈ పేరు పెట్టారని కొందరి అభిప్రాయం. మూడవది, పరిశోధనా ఆధారిత నిర్ధారణ — రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ గారి అన్నగారైన రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు గారు తమ రచనల్లో ఈ మాట వాడారని.

ఈ మూడవ అభిప్రాయానికి సాక్ష్యం డా. నాగసూరి వేణుగోపాల్ — 12 ఫిబ్రవరి 2022న ప్రపంచ రేడియో దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రసారం చేసిన కార్యక్రమంలో అందించారు. వారి ప్రకారం, రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు గారు — అనంతపురం నుండి వచ్చిన పప్పూరు రామాచార్యులు గారి నిర్వహణలోని 'వదరుబోతు వ్యాసాల్లో' — మైసూర్ రేడియో స్టేషన్ గురించి 'ఆకాశవాణి' అనే మాటను వాడారు. మైసూర్ రేడియో స్టేషన్ ముందుగా యం.వి. గోపాలస్వామి ప్రైవేట్ ఆధ్వర్యంలో ఏర్పడి, దాదాపు ఏడేళ్లు నడిచాక మైసూర్ సంస్థానం దాన్ని తీసుకుంది; ఆపై భారత ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 1958 నుండి భారత ప్రభుత్వం 'ఆకాశవాణి' అనే పేరును ఆల్ ఇండియా రేడియోకు అధికారికంగా స్వీకరించి ప్రథమ తాంబూలం ఇచ్చింది.

అయితే ఈ వివాదానికి సంబంధించి కొన్ని భ్రమపడే సంఘటనలు ఉన్నాయి. 2019లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రసారం చేసిన 'నిస్తంత్రీ స్వరం' అనే శ్రవ్య లేఖలో మైసూర్‌కి చెందిన గోపాలస్వామి 'ఆకాశవాణి' అనే పేరు పెట్టారని చెప్పారు; తర్వాత ప్రచురించిన శ్రవ్యలేఖల పుస్తకంలో కూడా అలాగే ముద్రించారు. 2017లో రవీంద్రభారతిలో జరిగిన సదస్సులో ఆచార్య ఎన్. గోపి కూడా 'యం.వి. గోపాలస్వామి అనే కర్ణాటక వ్యక్తి తాను నడిపే ప్రైవేట్ రేడియోకి ఆ పేరు పెట్టారని అంటుంటారు అని, లేదు ఆ పేరు ఆయనకి సూచించింది రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ గారని అంటుంటారని' చెప్పుకొచ్చారు. డా. బకినాల జయప్రకాశరావు తమ Ph.D. సిద్ధాంత గ్రంథంలో (ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి 2016) — యం.వి. గోపాలస్వామి యే 'ఆకాశవాణి' పేరిట కేంద్రాన్ని నడిపారని వ్రాశారు. ఈ అపవాదుకు ఆల్ ఇండియా రేడియో చెన్నై కేంద్రం ప్లాటినమ్ జూబ్లీ స్మారిక (పుట 8) ఆధారం.

ఈ సాక్ష్యాధారాల తులనాత్మక విశ్లేషణ తర్వాత చేరుకున్న నిర్ణయం: 'ఆకాశవాణి' నామకరణ కర్త రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు గారు. పేర్లలోని సామ్యం (గోపాలకృష్ణమాచార్యులు vs గోపాలస్వామి; రాళ్లపల్లి అన్న-తమ్ముడుల పేర్లు సారూప్యం) కారణంగా చాలామంది పొరబడుతున్నారు. చారిత్రక

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

ఖచ్చితత్వానికి రెండు వేర్వేరు విషయాలను గుర్తించాలి — (అ) పేరు పెట్టడం (నామకరణం) — రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు, తమ రచనల్లో; (ఆ) కేంద్రానికి ఆ పేరు వాడటం — యం.వి. గోపాలస్వామి, తమ ప్రైవేట్ మైసూర్ రేడియోకి. మొదటిది నామకర్తృత్వం; రెండవది అనువర్తనం. ఈ తేడాను గ్రహించడమే ఈ వివాదానికి పరిష్కారం.

**ఆకాశవాణి విస్తరణ — కీలక మైలురాళ్లు**

1952 జూలై 20న మొదటి జాతీయ సంగీత కార్యక్రమం; 1954లో మొదటి ఆకాశవాణి సంగీత సమ్మేళనం; 1956 ఆగస్టు 15న మొదటి జాతీయ నాటకం; 1957 అక్టోబర్ 3న వివిధ భారతి సేవలు; 1958లో AIR అధికారికంగా 'ఆకాశవాణి'గా మార్పు; 1959 నవంబర్ 1న మొట్టమొదటి టెలివిజన్ కేంద్రం దిల్లీలో ఆకాశవాణిలో భాగంగా ప్రారంభం; 1969 ఆగస్టు 15న 1000 KW సూపర్ పవర్ MW ట్రాన్స్‌మీటర్ కలకత్తాలో; 1974లో ఆకాశవాణి జాతీయ పురస్కారాలు ప్రారంభం; 1976 ఏప్రిల్ 1న దూరదర్శన్ ఆకాశవాణి నుండి వేరుపడి స్వతంత్ర ప్రసార వ్యవస్థగా అవతరించింది.

1977 జూలై 23న మొట్టమొదటి FM ప్రసారాలు మద్రాసు కేంద్రం నుండి; 1985 ఆగస్టు 15న గంట గంటకూ వార్తా ప్రసారాలు; 1994 ఏప్రిల్ 1న SKY రేడియో; 1994 సెప్టెంబర్ 10న ముంబై కేంద్రంలో మల్టీ ట్రాక్ రికార్డింగ్ స్టూడియో; 1997 నవంబర్ 23న ప్రసారభారతి కార్పొరేషన్ ఏర్పాటు — ఇది ఆకాశవాణి, దూరదర్శన్ ల పాలనా స్వరూపంలో మౌలిక మార్పు; 1998 ఫిబ్రవరి 25న టెలిఫోన్‌లో రేడియో వార్తలు, ఇంటర్నెట్‌లో నేరుగా ప్రసారం; 2004 జనవరి 26న 'రాగం' శాస్త్రీయ సంగీత ఛానల్ బెంగళూరులో; 2004 ఏప్రిల్ 1న కిసాన్ వాణి కార్యక్రమం దేశవ్యాప్తంగా 12 కేంద్రాల నుండి; 2004 డిసెంబర్ 16న DTH సేవలు; 2005 డిసెంబర్ 25న హైదరాబాద్‌లో FM Rainbow; 2006 జూన్ 17న విజయవాడలో FM Rainbow; 2010లో News on Phone సేవ 14 కేంద్రాల్లో; 2011 World Cup Cricket ప్రత్యక్ష ప్రసారం; 2012 మార్చి 27న బంగ్లాదేశ్ విమోచనోద్యమంలో ఆకాశవాణి సేవలకు ఢాకాలో ఆ దేశం పురస్కారంతో సత్కరించడం; 2014 అక్టోబర్ 3 నుండి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమం; NewsOnAir ఆండ్రాయిడ్/iOS మొబైల్ ఆప్.

**కార్యక్రమ వైవిధ్యం — ప్రజలతో అనుబంధం**

ఆకాశవాణి కార్యక్రమ వైవిధ్యం దాని ప్రజా సేవా స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. జాతీయ స్థాయిలో — ఆగస్టు 15, జనవరి 26 జాతీయ దినోత్సవాల కవాతుల ప్రత్యక్ష ప్రసారం; ఏటా నెలన్నర పైగా జాతీయ కళాకారుల ఆకాశవాణి సంగీత సమ్మేళనం; సంగీత త్రయం వాగ్గేయకార సంగీత వార్షికోత్సవం, త్యాగరాజ

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

ఆరాధనోత్సవం (తిరువయ్యారు ప్రత్యక్ష ప్రసారం); ప్రాంతీయ, జానపద, లలిత సంగీత జాతీయ కార్యక్రమం; సర్వ భాషా కవి సమ్మేళనం (1956 నుండి) — గణతంత్ర దినోత్సవ పూర్వ సంధ్యలో 22 భారతీయ భాషల్లో ప్రసిద్ధులైన కవుల కవితా గానం; రాష్ట్రపతి, ప్రధానమంత్రి ప్రసంగాల ప్రత్యక్ష ప్రసారం; క్రికెట్, ఒలింపిక్ క్రీడల ప్రసారం; బడ్జెట్ సమావేశాల ప్రత్యక్ష ప్రసారం; స్పాట్‌లైట్ (రోజువారీ జాతీయ చర్చా కార్యక్రమం); కరెంట్ అఫైర్స్ (శుక్రవారం విశేష కార్యక్రమం).

ప్రముఖ ఆధ్యాత్మిక ఉత్సవాల ప్రత్యక్ష ప్రసారాలు — ఆకాశవాణి ప్రాంతీయ కేంద్రాలు తమ ప్రాంతపు ముఖ్య క్షేత్రాల ఉత్సవ ప్రసారాలను దేశమంతటికీ అందిస్తాయి. శ్రీరామనవమి నాడు భద్రాచల సీతారాముల కల్యాణోత్సవ ప్రత్యక్ష వ్యాఖ్యానం (కొత్తగూడెం కేంద్రం) — వినని తెలుగువాడు ఉండబోడంటే ఇసుమంతైనా అతిశయోక్తి కాదు; మహాశివరాత్రి శ్రీశైలం లింగోద్భవ వ్యాఖ్యానం (కర్నూలు కేంద్రం); తిరుమల శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు (తిరుపతి కేంద్రం); యాదగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్ర ఉత్సవాలు; సింహాచల నారసింహ చందనోత్సవ విశేషం (విశాఖపట్నం కేంద్రం); శబరిమల అయ్యప్ప మకరజ్యోతి దర్శనం (స్థానిక ఆకాశవాణి కేంద్రం సహకారంతో తెలుగు అనౌన్సర్‌ను ప్రత్యేకంగా పంపించి వ్యాఖ్యానం); కుంభమేళా విశేషాలు — ఇవన్నీ ఆకాశవాణి సాంస్కృతిక సేవకు నిదర్శనాలు.

**ఆకాశవాణిలో తెలుగు — ఆరంభం, వికాసం**

ఆకాశవాణిలో తెలుగు కార్యక్రమాలు 1938లో మద్రాసు కేంద్రంలో ప్రారంభమయ్యాయి. మొట్టమొదటి తెలుగు అనౌన్సర్ మల్లంపల్లి ఉమామహేశ్వరరావు ('ఉమ' గా ప్రసిద్ధులు) — రేడియో తాతయ్యగా ఆనాటి తెలుగు పిల్లలందరికీ సుపరిచితులు. వీరి తర్వాత, నాటక విభాగంలో పనిచేస్తున్న 'రేడియో' భానుమతి మొదటి తెలుగు మహిళా అనౌన్సర్ అయ్యారు. 1938 జూన్ 16న తెలుగు ప్రసారాలు ప్రారంభమయ్యాక మొదటి తెలుగు ప్రసంగం 'భారతదేశము — రేడియో' చేసిన వారు సర్ కూర్మ వెంకటరెడ్డి నాయుడు — దక్షిణ భారత భాషల్లో రేడియోలో ప్రసారమైన మొదటి ప్రసంగం కూడా ఇదే. 1938 జూన్ 18న రెండవ ప్రసంగం 'సజీవమైన తెలుగు' గిడుగు రామ్మూర్తి పంతులు చేశారు. 1938 జూన్ 24న తొలి తెలుగు నాటకం 'అనార్కలి' ప్రసారమైంది. బాలానందం సంఘం స్థాపించి పిల్లలకు ఎంతో చేరువైన — రేడియో అన్నయ్య న్యాపతి రాఘవరావు, రేడియో అక్కయ్య న్యాపతి కామేశ్వరి దంపతులు ఒక తరం తెలుగు బాల హృదయాలకు రేడియో గంధాన్ని పూశారు.

ఆకాశవాణి తెలుగు రేడియో కేంద్రాల విస్తరణ క్రమం — హైదరాబాద్ (1935 — తొలి కేంద్రం, నైజాం రేడియోగా), విజయవాడ (1948 — తొలి తెలుగు రేడియో కేంద్రం), విశాఖపట్నం (1963), కడప

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

(1963). 1948 సెప్టెంబర్ 18న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమయ్యాక, 1950 ఏప్రిల్ 1న దక్కన్ రేడియోను ఆకాశవాణిలో విలీనం చేసి 'హైదరాబాద్' కేంద్రమని పేరు పెట్టింది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 12 ప్రధాన ఆకాశవాణి కేంద్రాలు పనిచేస్తున్నాయి — హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కడప, తిరుపతి, నెల్లూరు, మార్కాపురం, కర్నూలు, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం — ఇవి కాకుండా రిలే కేంద్రాలు కూడా ఉన్నాయి.

**సాహిత్యానికి ఆకాశవాణి కృషి**

మాటలంటే మాటలు — వెలకట్టలేని ముత్యాల మూటలు. అలాంటి ముత్యాల్లాంటి మాటల్ని కనిపించకుండా వినిపిస్తూ జన హృదయాలలో ఆత్మీయ బంధాన్ని ఏర్పరచుకున్నది ఆకాశవాణి. 2017లో (అప్పటికి భారతదేశంలో ప్రసారవ్యవస్థ ప్రభుత్వాధీనంలో పనిచేయడం మొదలై 80 యేళ్లైన సందర్భంగా) ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం స్థానిక రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రసంగ పరంపరలో పాల్గొన్న విశ్రాంత ఆకాశవాణి ప్రయోక్త శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ — 'రేడియో కేంద్రం లోపల కార్యక్రమ నిర్వాహకులుగా పనిచేసిన సాహిత్య వేత్తల కృషి... బయటి నుండి వచ్చి కార్యక్రమాల కోసం తమ రచనల ద్వారానూ, ప్రత్యక్షంగా పాల్గొనడం ద్వారానూ వివిధ రచయితలు చేసిన కృషి...' కారణంగా శ్రోతలకు సాహిత్యాన్ని చేరువయ్యేలా చేశారని తెలిపారు.

సాహిత్య కార్యక్రమాల వైవిధ్యం అపారం — కవిత్వం, కథ, నాటిక, నాటకం, రూపకం, సంగీతం, సాహిత్య సంచికలు, పుస్తక పరిచయాలు, ఉగాది సమ్మేళనాలు, జనవరి 26 అఖిల భారత సర్వభాషా కవి సమ్మేళనం, జాతీయ సంగీత సమ్మేళనం. శాస్త్రీయ సంగీత శిక్షణా కార్యక్రమాలు ధారావాహికగా నిర్వహించడమే కాదు, సంగీత పోటీలు నిర్వహించి ఉత్తమ కళాకారులను ప్రోత్సహించడం; ఆకాశవాణి గ్రేడెడ్ సంగీత కళాకారులకి విశేషమైన గుర్తింపు, అర్హత; ఆకాశవాణి గ్రేడెడ్ నాటక కళాకారులకి అదొక అర్హత, గౌరవం; ఆకాశవాణి సర్వభాషా కవి సమ్మేళనం, ఇతర సందర్భాల్లో నిర్వహించే కవి సమ్మేళనాల్లో పాల్గొనడం గొప్ప గుర్తింపు, గౌరవం; లలిత సంగీతానికి ఆకాశవాణి చేసినంత ప్రోత్సాహం మరెవరూ చేయలేదు; శాస్త్రీయ సంగీత కళాకారులకు ఆకాశవాణి బంగారు పీఠం వేసిందన్నది ఏమాత్రం అతిశయం కాదు.

సమస్యాపూరణ కార్యక్రమాలు భాషా-సాహిత్యాల పెంపుకు అపూర్వ వేదిక. ఏదేని ఒక సమస్యనిచ్చి దాన్ని ఒక పాదంగా తీసుకొని వృత్తపద్యమో, జాతి పద్యమో లేక చాటువో వ్రాసి పంపమని, వచ్చిన సమాధానాల్లోంచి బాగున్నవాటిని శ్రోతల పేర్లు చెప్పి వినిపించేవారు. ఒక విధంగా భాష, దాని నుండి

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

సాహిత్యం పరస్పర పెంపు, ప్రేమ ఒనగూడే ఒక పద్ధతి ఇది. మూడు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత తెలుగు కవులు ఆకాశవాణితో విశేష అనుబంధం కలిగి ఉన్నారు — విశ్వనాథ సత్యనారాయణ గారు విజయవాడ ఆకాశవాణి కేంద్ర ప్రాంగణంలో ఉగాది కవితలు చదివారు; డా. సి. నారాయణరెడ్డి గారు ఎన్నో సందర్భాల్లో ఆకాశవాణిలో ఎన్నో కవితలు చదివారు, 'తాను పెరిగిందంతా ఆకాశవాణి లోనే' అంటారు సినారె; డా. రావూరి భరద్వాజ ఆకాశవాణి సాహిత్య విభాగానికి అధిపతిగా పనిచేసి కవిత్వం వెలయించారు.

**సమకాలీన సవాళ్లు — విమర్శనాత్మక విశ్లేషణ**

1980 దశకం చివరి నుండి 2005 వరకు రేడియో ప్రభ తగ్గుతూ వచ్చిన చారిత్రక సందర్భాన్ని డా. ఆర్. అనంతపద్మనాభరావు తమ 'అలనాటి ఆకాశవాణి' వ్యాసాల్లో నమోదు చేశారు — 'చాలా ఇళ్లలో రేడియో సెట్లు లేని మాట వాస్తవం; ఛానళ్ళ సునామీలో ఆకాశవాణి అనే ద్వీపకల్పం చాలా భాగం కొట్టుకుపోయింది.' ఒకప్పుడు రేడియో చెప్పిందే వేదం. పంచాయతీ కార్యాలయాల బయట, పార్కుల్లో స్పీకర్లు పెట్టి రేడియో వార్తలు వినిపించేవారు. జనం ఠంచనుగా రేడియో వార్తలను బట్టి వేళలు సరిచూసుకునేవారు. టీవీ రాక, తొంబై దశకంలో కంప్యూటర్లు, ఆపై ఇంటర్నెట్, ఇప్పుడు ఇబ్బడి ముబ్బడిగా సామాజిక మాధ్యమాలు — ఈ వెల్లువలో రేడియో ఒక్కసారిగా జ్ఞాపకాల దొంతరల్లోకి వెళ్లిపోయింది. ఎఫ్.ఎం. ప్రసారాలు ప్రైవేట్‌లోనూ ప్రారంభమైనాక 2006 నుండి తిరిగి రేడియో ప్రసారాలు మొబైల్‌లోకి వచ్చేశాయి. డా. ఆర్. అనంతపద్మనాభరావు అభివర్ణన — 'రేడియో ఫీనిక్స్ పక్షిలా చితాభస్మం లోంచి మొలకెత్తుతోంది.'

ప్రసారభారతి (1997) ఏర్పడ్డాక ఆకాశవాణి, దూరదర్శన్ స్వయం పోషకంగా మారాల్సిన పరిస్థితి — తన అభివృద్ధికి, నిర్వహణకు కావలసిన ఆదాయ మార్గాలను సొంతంగా ఏర్పాటు చేసుకోవలసిన తప్పనిసరి స్థితి. కమర్షియల్ కోణంలో ఆలోచించాలి, ప్రజలకు దగ్గర కావాలి, ప్రభుత్వ గొంతుకగా ఉండాలి, ప్రైవేట్ ఛానల్స్ వలె శ్రోతలను ఆకర్షించాలి — ఇది ఒక శిరోభారమే. ఆకాశవాణి విశాఖపట్నం విశ్రాంత అనౌన్సర్ కె. మధుసూదన్ ఆకాంక్షించారు — 'సదరు రేడియో స్టేషన్ నెలకొలుబడ్డ స్థానిక ప్రజల జీవన రీతుల్ని, కళా కౌశలాన్ని, లోకల్ టాలెంట్‌ను గుర్తించి కార్యక్రమాల రూపకల్పన చేసి ప్రసారం చేసే బాధ్యత నిర్వహించడం ఒక వైపు, సొంతంగా ఆర్థిక వనరులు చూసుకోవడం మరో వైపు — ఇదంతా అంత తేలికైన మాట కాదు. సంస్కృతిని వారసత్వంగా కొనసాగించాలి అనే ఆకాంక్ష కుంటుపడకుండానే ఇది కొనసాగాలి.'

మల్లాది సూరిబాబు ఆవేదన పూరితంగా ఒక మౌలిక ప్రశ్నను ముందుంచారు — 'ఉద్యోగభద్రతయే లక్ష్యంగా పనిచేసేవారు ఎక్కువైన కారణంగా... ఇక సృజనాత్మకతకు చోటేది?' ఇంద్రగంటి శ్రీకాంతశర్మ తమ

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

ప్రసంగంలో — 'నేడు ప్రసార వ్యవస్థ చారిత్రకంగా ఒక కూడలిలో ఉంది. కార్యక్రమాల నిర్వహణ పట్ల కళాత్మక కాంక్ష, సృజనాత్మక నైపుణ్యం విలసిల్లి సాహిత్యపరంగా ఈ వ్యవస్థకు పూర్వ వైభవం సంఘటిల్లాలి' అని ఆశించారు. ఈ నేపథ్యంలో డా. బెజవాడ గోపాలరెడ్డి సమాచార ప్రసార శాఖల మంత్రిగా ఉన్నప్పటి సూత్రాన్ని గుర్తు చేసుకోవడం సందర్భోచితం — రేడియోలో అందరికీ అర్థమయ్యే భాష ఉపయోగించాలని ఆదేశాలు; వ్రాసే భాష, మాట్లాడే భాష విడివిడిగా ఉండాలని ప్రత్యేకంగా ప్రవచన శాఖ ప్రయోక్తలను (Spoken Word Producers) నియమించారు. ఈ మౌలిక సూత్రాన్ని ఈ నాటికీ గుర్తుంచుకోవలసిన అవసరం ఉంది.

**విశ్లేషణ — ముఖ్య పరిశీలనలు**

ప్రస్తుత అధ్యయనం ఆధారంగా కొన్ని ముఖ్యమైన పరిశీలనలు చేయవచ్చు.

1. ఆకాశవాణి భారతీయ ప్రజాస్వామిక ప్రసార వ్యవస్థగా ఒక శతాబ్దపు చారిత్రక యాత్రను సఫలంగా పూర్తి చేసింది. 1920లో ప్రైవేట్ క్లబ్‌గా మొదలై, 1936లో ప్రభుత్వ సంస్థగా, 1958లో 'ఆకాశవాణి'గా, 1997లో ప్రసారభారతి కార్పొరేషన్‌గా — ఈ క్రమం స్వరూపపరమైన పరిణతిని ధృవీకరిస్తుంది.

2. 'ఆకాశవాణి' నామకరణ వివాదం ప్రాథమిక సాక్ష్యాధారాల ఆధారంగా పరిష్కరించబడింది; నామకర్త రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు, వాడిన మొదటి కేంద్రం యం.వి. గోపాలస్వామి మైసూర్ రేడియో — ఈ తేడాను స్పష్టంగా గుర్తించడం చారిత్రక ఖచ్చితత్వానికి అవసరం.

3.తెలుగు సాహిత్యానికి ఆకాశవాణి ఇచ్చిన దోహదం అపరిమితం. 1938 జూన్ 16న తెలుగు ప్రసారాలు మొదలై, ముగ్గురు జ్ఞానపీఠ గ్రహీత తెలుగు కవులు (విశ్వనాథ, సినారె, రావూరి భరద్వాజ) ఆకాశవాణితో గాఢ అనుబంధం; విశ్వనాథ సత్యనారాయణ 'వేయి పడగలు' శ్రవ్య నాటకం, మల్లాది రామకృష్ణ శాస్త్రి-ఘంటసాల 'గిరిజా కల్యాణం', ఉష శ్రీ 'రామాయణం', శంకరమంచి సత్యం 'అమరావతి కథలు', ఎం.ఎస్. రామారావు 'సుందరకాండ', బాపు-బుచ్చిబాబు-పాలగుమ్మి పద్మరాజు సహకారంతో 'చివరికి మిగిలేది', కాళిదాసు 'మేఘసందేశం' రేడియో సంగీత రూపకం — ఇవి శ్రవ్య సాహిత్య సంపదలో అమూల్య రత్నాలు.

5.ఆకాశవాణి ప్రాంతీయ కేంద్రాలు, ముఖ్యంగా విశాఖపట్నం వంటి కేంద్రాలు, ప్రాంతీయ సాహిత్య-సాంస్కృతిక సంరక్షణకు ఒక మోడల్‌గా నిలుస్తాయి. ఉత్తరాంధ్ర సాహితీవేత్తలతో, ఉత్తర కోస్తా మత్స్యకార జనజీవనంతో, ప్రెసిడెంట్స్ ఫ్లీట్ రివ్యూ వంటి జాతీయ సందర్భాలతో — ఈ కేంద్రం ఒక ప్రాంతీయ గుర్తింపును జాతీయ స్థాయికి తీసుకువెళ్లే వేదిక.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

5.ఆధునిక మీడియా వెల్లువలో సృజనాత్మకత తగ్గినదన్న ఆందోళన (మల్లాది సూరిబాబు, శ్రీకాంతశర్మ ప్రకటించిన ఆవేదన) వ్యవస్థాగత పరిమితులను సూచిస్తుంది; ఉద్యోగభద్రత-సృజనాత్మకత మధ్య నిర్మాణాత్మక ఉద్రిక్తత (structural tension) ను పరిష్కరించడం పునరుజ్జీవనానికి కీలకం. ఏడవది — 'మన్ కీ బాత్' (2014 నుండి) వంటి కార్యక్రమాలు రేడియోకు పునఃప్రవేశం కల్పిస్తున్నాయి; సాంకేతిక సదుపాయాలు (FM, మొబైల్ ఆప్, DTH, విజువల్ రేడియో) రేడియోకు కొత్త జీవం పోశాయి.

**ముగింపు**

ప్రాచీన కాలంలో నన్నయ తెలుగు భాషా వికాసానికి ఆద్యుడు అయినట్టే, ఆధునిక కాలంలో తెలుగు భాషా వినియోగానికి, పలుకుబడికి, విజ్ఞాన ప్రసారానికి, సంస్కృతీ వికాసానికి, సమాచారం విస్తరించడానికి ఆకాశవాణి అద్వితీయ సేవ చేసింది. ఎందరో మహనీయులు మొదలు సాధారణ ప్రజల వరకు తన గొంతును వినిపించింది. వారి వాణిని తన వాణిగా వినిపించింది. అపారమైన స్వర సంపదను నిక్షిప్తం చేసింది. చారిత్రక భాండాగారం అయింది. ఈ నిస్తంత్రీస్వరం దేశప్రజలను తన స్వర ధారలో ఐక్యం చేసింది. స్వాతంత్ర్యోద్యమ నినాదమైంది. విప్లవ వాణి అయింది. స్వాతంత్ర్య ప్రకటన ఇచ్చింది. ప్రభుత్వ స్వరంగా నిలిచింది. అభివృద్ధికి ప్రచారకర్త అయింది. ప్రజాపక్షమై జనవాణిని ప్రసారం చేస్తోంది.

వేకువనే లేచి, అందరూ నిద్రలోకి జారుకున్నాక తాను విశ్రాంతి తీసుకొనేది; ఇప్పుడు 24 గంటలూ ప్రసారాలను అందిస్తోంది. విలువ తెలిసి ఉపయోగించుకుంటే ఎప్పటికీ తోడుగా ఉంటుంది; వ్యక్తి-వ్యక్తిత్వ వికాస తరంగిణిగా కలకాలం నిలుస్తుంది. దేశంలోని మారుమూల మనిషిని కూడా పలకరించగలిగేది ఒక్క రేడియో మాత్రమే. అంటే 140 కోట్ల (పైబడ్డ) భారతీయులందరినీ ఒక్క స్వరసూత్రంలో కలపగలిగే శక్తి ఆకాశవాణికి ఉంది. ఆ సూత్రంలో మమేకమవ్వగల వివేకం ప్రజలకు ఉండాలన్న మాటను మనం విశ్వసించాలి.

ప్రస్తుత మీడియా వెల్లువలో ఆకాశవాణి తన ప్రజా సేవా ప్రసార మాధ్యమ గుర్తింపును కాపాడుకుంటూనే, సృజనాత్మక కార్యక్రమాల రూపకల్పనలో పూర్వ వైభవం సాధించడమే ముందున్న కర్తవ్యం. వ్రాసే భాష-మాట్లాడే భాష మధ్య మౌలిక భేదాన్ని గుర్తుంచుకుంటూ, శ్రవ్య మాధ్యమ ధర్మాన్ని పాటిస్తూ, ప్రాంతీయ సాంస్కృతిక వైవిధ్యాన్ని పెంపొందిస్తూ, బాలల-యువతల-మహిళల-వయోధికుల అన్ని వర్గాల అవసరాలను తీర్చుతూ, శాస్త్రీయ-లలిత-జానపద సంగీత సంప్రదాయాన్ని కొనసాగిస్తూ — ఆకాశవాణి తన మౌలిక లక్షణాన్ని, అది 'నమ్మకం'ను, కాపాడుకుంటే ఆధునిక సాంకేతిక యుగంలో కూడా అది అత్యవశ్యక ప్రజా సేవా ప్రసార సాధనంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

**ఆధార గ్రంథాలు**

ప్రసారభారతి అధికారిక వెబ్‌సైట్ — https://prasarbharati.gov.in; మొబైల్ ఆప్ — NewsOnAir; https://newsonair.gov.in/

డా. నాగసూరి వేణుగోపాల్, శ్రీ కే.ఎస్. శర్మ పరిచయాలు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రసారం, 12 ఫిబ్రవరి 2022 (ప్రపంచ రేడియో దినోత్సవం).

డా. నాగసూరి వేణుగోపాల్. 'రేడియో కథ'. ఆకాశవాణి ప్రసారం, 16.06.2018.

డా. ఆర్. అనంతపద్మనాభరావు (2014). 'అలనాటి ఆకాశవాణి'. మే 2014.

శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. 'రేడియోకి వన్నె తెచ్చిన సాహితీ మూర్తులు'. ఆకాశవాణి ప్రసారం, 09.06.2018.

శ్రీ మల్లాది సూరిబాబు. 'మాటకూ శ్రుతిలయలున్నాయి...'; "అమృతవర్షిణి" వ్యాసాలు, ఆంధ్రభూమి ఆదివారం, 26 మే 2019, పుట: 5.

శ్రీ ఎన్. గోపి. 'నా జ్ఞాపకాల్లో ఆకాశవాణి'. ఆకాశవాణి ప్రసారం, 09.06.2018.

శ్రీ ఓలేటి పార్వతీశం. 'రేడియో కవిత్వం'. ఆకాశవాణి ప్రసారం, 07-07-2018.

శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి. "కొత్త ప్రేమలేఖలు" (శ్రవ్య లేఖలు), సం. 2019, 2020.

శ్రీ కె. మధుసూదన్ (2002). 'విశాఖ తీరాన ఆకాశవాణి'.

డా. వేదగిరి రాంబాబు. 'తెలుగు కథానిక'. ప్రపంచ తెలుగు మహాసభలు, తిరుపతి, డిసెంబర్ 27-29, 2012, పుట: 78-79.

డా. పోరంకి దక్షిణామూర్తి. 'కథానిక – స్వరూప స్వభావాలు' (సిద్ధాంత గ్రంథం), 1988.

డా. పోరంకి దక్షిణామూర్తి. 'తెలుగు కథానిక'. తెలుగువాణి, మార్చి 1978, పుట: 37.

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి. 'కథానిక'. ఆగస్టు 1936.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి. 'గులాబీ అత్తరు' (16 కథలు). ఆగస్టు 2021, పుట: 3.

మధురాంతకం రాజారాం, సంగమనేని నారాయణ. 'తెలుగు కథకులు–కథన రీతులు' (సంపాదకీయ వ్యాసం).

డా. దార్ల వెంకటేశ్వర రావు. 'తెలుగులో తొలి కథానిక ఏది? ఎందుకు?'. పరిశోధనా పత్రం, జనవరి 2-22, 2009.

త్రిపురనేని గోపీచంద్. 'నేను కథను ఎలా వ్రాస్తాను'. ఆకాశవాణి ప్రసంగం.

శ్రీ కాకరపర్తి సత్యనారాయణ మూర్తి. 'కథాసరిత్సాగరం'. ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ధారావాహిక.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం స్వర్ణోత్సవ స్మారిక (2013) — శ్రీమతి ప్రయాగ వేదవతి, శ్రీ పి. నాగేశ్వరరావు, శ్రీ ద్విభాష్యం రాజేశ్వరరావు, డా. నేదునూరి కృష్ణమూర్తి సందేశాలు.

ఆచంట జానకిరామ్ మొదలు ఈ తరం వరకు ఆకాశవాణి సిబ్బంది-ప్రయోక్తల పరిచయాలు. 'వాచస్పతి' గ్రంథం, శ్రీ అంబడిపూడి మురళీకృష్ణ, శ్రీ మడిపల్లి దక్షిణామూర్తి సంపాదకీయ (2010).

ఈనాడు తెలుగు దినపత్రిక, వికీపీడియా — 'ఆకాశవాణి' (2021) తెలుగు చిత్ర సమీక్షలు.